క్లుప్తంగా

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): సౌదీ అరేబియాలో పనిచేస్తూ మృతి చెందిన బషు షేక్ కుటుంబ సభ్యులకు కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం చెక్ అందజేశారు. జిల్లాలోని ఉయ్యూరులోని హక్ వీధికి చెందిన బషు షేక్ ఇటీవల సౌదీ అరేబియాలో మరణించాడు. రియాద్‌లోని భారత ఎంబసీ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం రూ.2,68,182 విలువైన చెక్కును బషు షేక్ భార్య సబీరున్నీసాకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

రేమాలవారిపాలెం(నాగాయలంక): గ్రామం శివారు పేర్లవానిలంకలో కొలువైన గ్రామ దేవత శ్రీమాతా అంకాలమ్మ దేవాలయానికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు చెన్ను రంగారావు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం అమ్మవారికి ఆషాఢ మాసం పురస్కరించుకుని పట్టు వస్త్రములు సమర్పించిన అనంతరం ఆలయ కమిటీ పెద్దలకు రూ.5116 నగదు అందజేశారు. కమిటీ సభ్యులు కైతేపల్లి రాంబాబు, కైతేపల్లి కృష్ణ, కైతేపల్లి సుబ్బారావు, పెద్దలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోడూరు: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆదేశించారు. నీటి నిల్వలు వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ జ్వరాలతో పాటు డైయేరియా సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే సమీప హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలని ఎంపీడీఓ కోరారు. ఈఓపీ ఆర్డీ నాగరేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు తాగునీరు

పెడన: పట్టణంలో పుర ప్రజలకు తాగునీరు ఇక నుంచి రోజు విడిచి రోజు సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు నీరు విడుదల కాని పరిస్థితి నెలకొనడంతో ఇప్పటి వరకు మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువల ద్వారా నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పుర ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు. జోన్-1, జోన్-2లుగా రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతుందని, పురప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

సాగునీరు విడుదల

మోపిదేవి: మండల పరిధిలోని కె.కొత్తపాలెం కేఈబీ కెనాల్ వద్ద 9వ నంబర్ కాలువకు ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ సోమవారం సాగునీటిని విడుదల చేశారు. సాగునీటి విడుదలతో ఈ ప్రాంత రైతులు నారుమళ్లు పోసుకోవచ్చని డీఈ సూచించారు. ఇరిగేషన్ ఏఈలు వెంకటేశ్వరరావు, జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మత్స్యకారుడు మృతి

కోనేరుసెంటర్: విద్యుదాఘాతానికి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బందరు మండలం వెంకటదుర్గాంభపురం గ్రామానికి చెందిన కొప్పనాతి జగన్‌మోహన్‌రెడ్డి (36) చేపలవేట చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు పాపలు, బాబు ఉన్నారు. రోజులానే జగన్‌మోహన్‌రావు సోమవారం చేపలవేటకు వెళ్లాడు. మురుగుకాలువలోకి వల విసురుతుండగా ప్రమాదవశాత్తు వల పక్కనే ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో జగన్‌మోహన్‌రావు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జగన్‌మోహన్‌రావు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య నాంచారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ చట్టం పర్యవేక్షణ కమిటీ సభ్యత్వానికి దరఖాస్తు చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుపై జిల్లా పర్యవేక్షణ కమిటీలో సభ్యుల ఎంపిక కోసం అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహిద్‌బాబు సోమవారం కోరారు. ఎన్జీవోలతో అనుబంధం ఉన్న ఎస్సీ, ఎస్టీలు కాకుండా ఇతర వర్గాలకు చెందిన వారు అర్హులన్నారు. అర్హత కలిగిన వారు పూర్తి బయోడేటాతో దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు మచిలీపట్నం కలెక్టరేట్‌లోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నిరుద్యోగుల నిరీక్షణ

- భృతిపై ఆశలు కల్పించిన కూటమి
- భృతి కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు
- ఉద్యోగ కల్పన కోసం ఆశగా ఎదురుచూపులు
- మచిలీపట్నం నియోజకవర్గంలో 71 వేల కుటుంబాలు



బాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌లో మొదటి హామీ

మచిలీపట్నంటౌన్: ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల భృతి కల్పిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ అమలు కోసం నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ భృతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాల కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ రెండు హామీలు ఎప్పుడు నెరవేరుతాయోనని నిరుద్యోగులు ఆశగా చూస్తున్నారు. ఉద్యోగ కల్పనకుముందు నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారోనని నిరుద్యోగుల చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులు గడిచినా నిరుద్యోగులకు భృతి అందించటంపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు. చేసేందుకు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటూ కుటుంబానికి భారంగా మారటంతో వారు చెందుతున్న ఆవేదన వర్ణనాతీతం. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగ భృతి అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా ..

మచిలీపట్నం నియోజకవర్గంలోని నగరపాలక సంస్థ పరిధిలో 48,010 కుటుంబాలు, మండలంలో 23 వేల కుటుంబాలు మొత్తం 71,010 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబానికి నిరుద్యోగులకు భృతి ఇస్తానన్న సీఎం చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలని ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగులు కోరుతున్నారు. నిరుద్యోగులందరికీ భృతి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అందరికీ అందకుండా ఉండేలా నిబంధనలు పెట్టొద్దని కోరుతున్నారు. ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇచ్చే విధంగా ప్రభుత్వ పెద్దలు అడుగులు వేయాలంటున్నారు. ఉన్నత చదువులు చదివి అరకొర జీతాలతో ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా ప్రస్తుతం ఎలాంటి ప్రకటనలు చేయకపోవటంతో వీరు ఆందోళన చెందుతున్నారు.

నిరుద్యోగ భృతి అందేనా..?

పెడన: ఉద్యోగం లేని ప్రతి వారికి భృతి కల్పిస్తామని ఎన్డీయే కూటమి సాధారణ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తుందాని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ భృతి కోసం గంపెడాసాతో నిరీక్షిస్తున్నారు. పెడన నియోజకవర్గంలో సుమారు 60 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. పెడన మండలంలో 9,700, పట్టణంలో 8,600, బంటుమిల్లిలో 16,000, కృత్తివెన్నులో 13 వేలు, గూడూరులో 12 వేలు కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబానికి నిరుద్యోగులకు భృతి ఇస్తానన్న సీఎం చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలని ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగులు మొరపెట్టుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివి చాలీచాలని జీతాలతో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం కోసం..



ఐటీఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. చాలీచాలనీ జీతంతో ఉన్నా. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఆశతో ఉన్నా. ఎన్డీయే కూటమీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని నమ్మకంతో ఓటేశా. ఉద్యోగం కాకపోయినా నిరుద్యోగ భృతి ఇస్తుందని ఆశ ఉంది.

–ఎన్.హేమశంకర్, ఐటీఐ, 15వ వార్డు, పెడన

కుటుంబానికి భారం అవుతున్నాం



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివి ఖాళీగా ఉంటున్నా. ఏ ఉద్యోగం లేకపోవటంతో కుటుంబానికి భారంగా ఉన్నా. ఉద్యోగ అవకాశం కల్పించేలోపు ప్రభుత్వం నిరుద్యోగ భృతిని అందజేయాలి. ఈ భృతి రూ.3 వేలు అందితే కుటుంబానికి కొంత చేదోడుగా ఉంటుంది. ఉద్యోగాలకు ప్రిపేర్ కావడానికి ఆసరా అవుతుంది

–ఎన్.భరత్‌కుమార్, మచిలీపట్నం

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మహా కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఉద్యోగాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. వెంటనే జాబ్ క్యాలెండర్‌ని ప్రకటించి మాలాంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇప్పించాలి. ఈ లోగా భృతి ఇవ్వాలి.

–అద్దంకి నాగమణి, బీఏ, కోడూరు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



తాము అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతి ఇస్తామని మహాకూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. గతంలోలా కాకుండా ఇచ్చిన హామీని నెరవేర్చేలా చర్యలు చేపట్టాలి. వెంటనే నిరుద్యోగ భృతి ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–చాంద్ర శశికాంత్, బీటెక్, కొడాలి

ఆశగా ఎదురు చూస్తున్నాం



అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని, రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ ఇస్తే మాకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం.

–జి.కళ్యాణ్, ఐటీఐ, తెలుగురావుపాలెం

నిరుద్యోగ భృతి భ్రాంతియేనా?

- జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్
- అవనిగడ్డ నియోజకవర్గంలో 79,247 కుటుంబాల ఎదురుచూపు

అవనిగడ్డ: దివిసీమలో నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా మహాకూటమి ఇచ్చిన హామీని అమలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

79,247 కుటుంబాల ఎదురు చూపు

అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 79,247 గృహాలున్నాయి. అవనిగడ్డ మండలంలో 6,940, చల్లపల్లిలో 6,523, ఘంటసాలలో 4,359, కోడూరులో 4,779, మోపిదేవిలో 5,602, నాగాయలంక మండలంలో 6,554 గృహాలు ఉన్నాయి. దివిసీమలో ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నవారు 3,500 మంది ఉంటున్నారు. డిగ్రీలు, పీజీలు చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నవారు వేలాది మంది ఉన్నారు.

కూటమి హామీతో స్వస్థలాలకు..

దివిసీమకు చెందిన కొంతమంది హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కూటమి ఇచ్చిన హామీ మేరకు కొంతమంది ఉద్యోగాలు వదిలి గ్రామాలకు చేరుకుని పనులు చేసుకుంటున్నారు. మరికొంతమంది జాబ్ క్యాలెండర్ ఇస్తారనే ఆశతో కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. 2014లో రూ.2 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాటతప్పారని కొంతమంది నిరుద్యోగులు గుర్తు చేస్తున్నారు. ఈ సారి అలా కాకుండా ప్రతి ఏటా ఇస్తామన్న 4 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన రూ.3 వేలు నిరుద్యోగ భృతిని వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కొంతమంది నిరుద్యోగులు కోరుతున్నారు.

డెప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే



అవనిగడ్డ: స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ని కలసి అభినందించారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పవన్ కళ్యాణ్‌ని కలసిన బుద్ధప్రసాద్ కూరగాయలు ఉన్న బొకేని అందించి అభినందించారు.

స.హ.చట్టంపై అవగాహన

కోడూరు: సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఏఓ ఎం.శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడ కోసం ఈ చట్టాలను అందుబాటులో తీసుకువచ్చినట్లు తహసీల్దార్ చెప్పారు. 2005వ సంవత్సరం నుంచి అందుబాటులో వచ్చిన ఈ చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, చట్టాన్ని ఏవిధంగా వినియోగించాలనే అంశాలను వివరించారు. వ్యవసాయ శాఖలోని సమాచార హక్కు చట్ట వినియోగాన్ని ఏఓ వివరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

గూడూరు: ఎరువులు, పురుగు మందు దుకాణదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ స్పష్టం చేశారు. రాయవరంలోని ఎరువుల దుకాణాన్ని ఏఓ జి.వి.శివప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో రిజిస్టర్ల ప్రకారం స్టాకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. నాణ్యమైన ఎరువులనే విక్రయించాలని, నాసిరకంగా ఎరువులను అంటగట్టి రైతులను నష్ట పర్చవద్దని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రియదర్శిని పాల్గొన్నారు.

మట్టిదందా, జూదాలు కనబడటం లేదా?

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టిస్తారా?
- ఇందుకేనా మీకు అధికారం ఇచ్చింది
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: చట్టబద్ధత పనులంటే పేకాట ఆడించడం, కోడిపందేలు వేయించడం, అక్రమంగా మట్టి, ఇసుక తోలుకోవడం మీ దృష్టిలో మంచి పనులా అని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ల సమీక్ష సమావేశాల్లో అధికారులు చట్టబద్ధంగా నీతులు వల్లించే శాసనసభ్యులు బుద్ధప్రసాద్‌కు మండలాలుగా పంచుకుని జనసేన, టీడీపీ నేతలు చేస్తున్న అక్రమ మట్టిదందా, జూదాలు కనబడటం లేదా అని ఎద్దేవా చేశారు. నాగాయతిప్పలో స్కూల్ ప్రాంగణం మెరక తోలేందుకు మట్టి తోలితే అడ్డుకున్న బుద్ధప్రసాద్‌కు నేడు యథేచ్ఛగా సాగుతున్న మట్టి అమ్మకాలకు ఏమని సమాధానం చెబుతారని రమేష్‌బాబు ప్రశ్నించారు. మూడు సంవత్సరాల క్రితం సుప్రీంకోర్టులో క్లోజ్ చేసిన కేసుని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిడపై అక్రమంగా తిరగదోడి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. మాట్లాడితే పోలవరం నాశనం చేశారని చెబుతున్నారని, పోలవరానికి మీరు చేసిందేమిటో, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిందేమిటో ప్రజలకు తెలుసన్నారు. చంద్రబాబు పాలనలో పోలవరం ఏటీఎంగా మారిందని, ధనయజ్ఞమని చెప్పిన జనసేన, బీజేపీ నేతలు నేడు కూటమితో అంటకాగుతున్నారని చెప్పారు. చంద్రబాబు ఎక్కితే వానలుండవు, ప్రాజెక్టులు నిండవు అనే నానుడు ఉందని, నేడు అదే నిజమవుతుందని సింహాద్రి తెలిపారు. సాగునీటికి ప్రధాన ఆధారమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను వదిలేసి మొక్కుబడిగా పట్టిసీమ నుంచి నాలుగు మోటార్లు ఆడించి నీరు విడుదల చేస్తే ఎవరికి సరిపోతాయని, ఇది ఖచ్చితంగా రైతులను మోసగించడమే అన్నారు. మేము అధికారంలోకి వస్తే అప్పులు చేయకుండా సంపద సృష్టిస్తామని చెప్పిన మహాకూటమి, నేడు ఖాళీ ఖజానా అప్పచెప్పారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో మీరు ఖాళీ ఖజానా అప్పజెప్పలేదా అని సింహాద్రి ప్రశ్నించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, చేస్తానని చెప్పిన వాటికి జీవోలో స్పష్టంగా చెప్పాలని రమేష్‌బాబు డిమాండ్ చేశారు. రైతు భరోసా, తల్లికి వందనం, మహిళలకు రూ.18 వేలతో పాటు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సింహాద్రి రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. దివిసీమలో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేసింది బుద్ధప్రసాదే అని, డెల్టా ఆధునికీకరణకు రూ.165 కోట్లు మంజూరైతే అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు నిర్మించకుండా రైతులు ఈ పరిస్థితి రావడానికి కారణం ఎవరో అందరికీ తెలుసన్నారు. అవసరం అయితే డెల్టా పనులపై సీబీఐ విచారణ చేసుకోవాలని ఎప్పుడూ చెప్పే బుద్ధప్రసాద్ అధికారంలో ఉన్నది మీరే కనుక సీబీఐ విచారణ వేసుకోవాలని రమేష్‌బాబు హితవు పలికారు. 5 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి, ప్రభుత్వ స్కూల్స్‌ని డెవలప్ చేస్తే నాశనం చేశారని కూటమి ప్రభుత్వం విష ప్రచారంచేస్తోందని, దమ్ముంటే మీరు అభివృద్ధి చేసి చూపించండని సింహాద్రి రమేష్‌బాబు సవాల్ విసిరారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, మండల కో ఆప్షన్ సభ్యుడు నజీర్‌బాషా, యువనేత చింతలపూడి బాలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



ఆసుపత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గూడూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి రిజిస్టర్లను తనిఖీ చేయడంతో పాటుగా రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి మంచి పేరు తెచ్చే విధంగా సిబ్బంది సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి, అన్నం హరిరామకృష్ణ, గోపి నాగబాబు, మహ్మద్‌రఫీ, పోతన రామోజీ, దాసరి ఉమాసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవం



నాగాయలంకలో కన్యకాపరమేశ్వరి, పార్వతీదేవికి సమర్పించిన ఆషాఢపు సారె

నాగాయలంక: కృష్ణానదీ తీరంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో స్థానిక శ్రీరామ క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రప్రథమంగా నిర్వహించిన శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవం సోమవారం కనుల పండువగా ముగిసింది. ఉత్సవం జయప్రదంగా కొనసాగిందని శాకంబరీ అలంకారంతో ఉత్సవాలకు స్వస్తి పలికినట్లు కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు చెప్పారు. ముగింపు ఉత్సవంలో భాగంగా పదోరోజు తెల్లవారు జామున 5గంటలకు ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మ వారాహిదేవి పీఠం వద్ద శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం అర్చకులు చేపట్టిన పది రోజుల దీక్షను విరమించారు. ఈ సందర్భంగా 50 కిలోల కూరగాయలు, ఆకుకూరలు, భారీ సొరకాయలతో పీఠంపై వారాహీ అమ్మవారిని, ప్రధాన ఆలయంలో శ్రీకనకదుర్గమ్మను అలంకరించి శాకంబరి మహోత్సవం నిర్వహించారు. మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులుకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి), బోయపాటి రాము, మహిళా సేవకులు, కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగాయలంక: మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష ఆషాఢ వేడుక ఘనంగా నిర్వహించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ, కే భానుప్రసాద్ ఆశీస్సులతో ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో శ్రీనగరేశ్వర స్వామి, కన్యకాంబ, పార్వతీదేవి మూల విరాట్‌లను సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు ప్రధాన పీఠం వద్ద పొన్నూరు దిలీప్, అనూష దంపతులతో ఆర్యవైశ్య సంప్రదాయ రీతిలో ఆషాఢపు వేడుక పూజ జరిపారు. తొలుత 20 మంది వేద పండితులు అమ్మవార్లు ఇరువురికి లక్ష మల్లెలతో విశేషార్చన నిర్వహించారు. గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం నుంచి సారె పళ్లాలతో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు నాగాయలంక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఊరేగింపుతో తరలివచ్చి సారెను అమ్మవార్లకు సమర్పించారు. చిట్టా అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, తాడికొండ సత్యనారాయణ, మానేపల్లి శ్రీనివాసరావు, చిట్టా వెంకటశేఖర్, ఆకుతోట సీతారామయ్య, వాసవీ సేవాదళ్ యూత్ సభ్యులు, సంకర్షణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి ఊరేగింపుగా ఆషాఢ సారె తీసుకువస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ వద్ద ఉన్న శ్రీ మహిషాసురమర్దని సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సోమవారం శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి సుహాసినిలు సారెను సమర్పించారు. పలు రకాల స్వీట్లు, తినుబండారాలు, పండ్లు, పూలు, జాకెట్ ముక్క, గాజులు, పసుపు, కుంకుమలు తదితరాలను అమ్మవారికి సమర్పించారు. సారెతో ప్రదర్శనగా ఆలయానికి వచ్చిన భక్తులు జై మహిషాసురమర్దని అంటూ నినదించారు. ఆలయపాలక మండలి సభ్యుడు యెండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక దానాశక్తి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారెను సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. కోడూరులోని శ్రీదానాశక్తి ఆర్య వైశ్య ప్రార్థనా మందిరంలో అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అన్నం వంశీయులు ఆషాఢ సారెను ఊరేగింపు ఆలయం వద్దకు తీసుకువచ్చారు. 21 రకాల పుష్పాలు, పసుపు, కుంకుమ, గోమాత, కుబేర, గవ్వలు, గాజులు, పండ్లును సమర్పించి, హారతులందించి భక్తిప్రపత్తులు చాటారు. వాసవీ అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవమూర్తికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

కృత్తివెన్ను: పరిమితికి మించి లోడు వాడకం, అక్రమ విద్యుత్ వినియోగం తదితర అంశాలపై సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కృత్తివెన్ను మండలంలో తనిఖీలు నిర్వహించారు. వివరాలను పెడన డీఈఈ ఆర్‌కే మాణిక్యాలరావు వెల్లడించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొత్తం 39 బృందాలు మండల వ్యాప్తంగా తనిఖీలలో పాల్గొన్నారన్నారు. తనిఖీలలో భాగంగా 1,075 గృహ సర్వీసులు, 127 వాణిజ్య సముదాయాలు, 104 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశామన్నారు. వీటిలో 117 సర్వీసులకు 285 కిలోవాట్లు అదనపు లోడు వాడుతున్నట్లు గుర్తించి రూ.7,22,060 జరిమానాలు విధించిచామని తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 94408 12362, 94408 12363, 83310 14951 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ విజిలెన్స్ తనిఖీలలో మచిలీపట్నం ఈఈ ఎం. భాస్కరరావు, కృత్తివెన్ను ఏఈఈ (ఇన్‌చార్జ్) రవికుమార్, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏఈఈ, జేఈఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

పెడన: యువత చదువుపై ఆసక్తి చూపించడంతో పాటు ఇతర వృత్తులలో ఉపయుక్తంగా ఉండే వాటిల్లో నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పీబీ సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం పెడన శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రతి పనిలో నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. స్కిల్ హబ్ ట్రైనర్ వంగ బాబు, అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, శ్రీను బాబు, రూపానాగశ్రీ, వెంకన్న, గిరి, గంగాధర్,రాజ్యలక్ష్మి, దుర్గ, మధులత పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని మృతి

గూడూరు: కప్పలదొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కొండవీటి సాయికృష్ణ (55) సోమవారం మృతి చెందారు. బంటుమిల్లి మండలం కొత్తూరు కంచడం ప్రాథమిక పాఠశాల నుంచి 2017లో బదిలీపై కప్పలదొడ్డి వచ్చిన సాయికృష్ణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీర్ఘకాలిక సెలవులో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం మచిలీపట్నంలోని స్వగృహంలో మృతి చెందారు. సాయికృష్ణ మృతి పట్ల ఎంఈఓ-1 బీఎస్‌సీ.శేఖర్‌సింగ్, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం



జానకీరామపురం గ్రామంలో నీటితో కాలువను తలపిస్తున్న సీసీ రోడ్డు

బంటుమిల్లి: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్ష ప్రభావానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి సాధారణ వాతావరణం నెలకొని ఉండగా మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయములో ఆకాశం మేఘావృతమై జల్లులు మొదలయ్యాయి. జల్లులు భారీ వర్షంగా మారి దాదాపు 2 గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. ఈ వర్షం దాదాపు 120 మి.మీ ఉంటుందని రెవెన్యూ అధికారులు చెప్పారు. వర్షం ప్రభావానికి బంటుమిల్లిలోని బీఎన్ఆర్, కేవీఆర్, జగనన్న కాలనీల్లో వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా ఆర్టీసీ బస్టాండు ఆవరణ నీటి కయ్యలుగా మారింది. బంటుమిల్లి-మచిలీపట్నం జాతీయ రహదారిపై నిలిచిన నీరు తటాకాన్ని తలపించింది. పలు గ్రామాల్లో రోడ్డు మార్జిన్‌లో అంతర్గత డ్రెయిన్లు లేక వర్షపు నీరు రోడ్లపై నిలిచి వాహనదారులను, పాదచారులను ఇబ్బందులకు గురిచేసింది.

కృత్తివెన్ను: కుండపోతగా కురిసిన వర్షం రైతుల్లో హర్షాన్ని నింపింది. నారుమడులు వేసుకున్న రైతులు, వెదపద్ధతిలో ఖరీఫ్ సాగును చేపట్టిన రైతాంగానికి ఈ వర్షం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలలోకి వర్షం నీరు చేరింది.